ప్రజావాణికి 71 ఫిర్యాదులు



వినతులు సమర్పించేందుకు వచ్చిన ప్రజలు

సంగారెడ్డి టౌన్, నారాయణఖేడ్, న్యూస్‌టుడే: తమ సమస్యలు పరిష్కరించాలంటూ వివిధ గ్రామాల నుంచి పలువురు సోమవారం కలెక్టరేట్‌కు వచ్చారు. అధికారులకు వినతిపత్రాలు అందజేసి పరిష్కారానికి అభ్యర్థించారు. కలెక్టర్ వల్లూరు క్రాంతి, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ ఆయా శాఖల అధికారులు వినతులు స్వీకరించారు. ప్రజావాణిలో అందిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. 71 ఫిర్యాదులు అందినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. ● ఇళ్ల మధ్య గోదాములు ఉండటంతో భారీ వాహనాల రాకపోకలతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోందని సంగారెడ్డి పట్టణంలోని 27వ వార్డు కాలనీవాసులు ఫిర్యాదు చేశారు. ● బెస్ట్ అవైలబుల్ పాఠశాలలకు సంబంధించిన బకాయిలు వెంటనే విడుదల చేయాలంటూ తెలంగాణ సోషల్ ఫోరం రాష్ట్ర కార్యదర్శి వేణుగోపాల్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ● నారాయణఖేడ్ మండలం కొండాపూర్‌కు చెందిన పాతులోత్ సాలిబాయికి చెందిన భూ సమస్య 20 ఏళ్లకు పరిష్కారం కాగా.. కలెక్టర్ పట్టాదారు పాసుపుస్తకం పంపిణీ చేశారు.

తాగునీటి ఇబ్బందులు రానీయొద్దు

సంగారెడ్డి టౌన్, న్యూస్‌టుడే: గ్రామాల్లో తాగునీటికి ఇబ్బందులు రానీయొద్దని కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రత్యేకాధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రత్యేకాధికారులు గ్రామాల్లో పర్యటనలపై ప్రతి నెలా నివేదికలు ఇవ్వాలని పేర్కొన్నారు. పారిశుద్ధ్య నిర్వహణ మెరుగుకు చర్యలు తీసుకోవాలన్నారు. నారాయణఖేడ్ మండలం సంజీవ్‌రావుపేట గ్రామంలో కలుషిత నీటి వల్ల చోటుచేసుకున్న ఘటనను దృష్టిలో ఉంచుకొని.. ఇలాంటి సమస్యలు పునరావృతం కాకుండా చూడాలని పేర్కొన్నారు. వసతిగృహాలను తనిఖీ చేయాలని, నాణ్యమైన విద్యా వాతావరణాన్ని కల్పించాలన్నారు.

ఉరుములు, మెరుపులతో వర్షం

సంగారెడ్డి అర్బన్, జహీరాబాద్: జిల్లాలో సోమవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. హత్నూరలో 33.3 మి.మీ., జహీరాబాద్ మండలం సత్వార్‌లో 32.8 మి.మీ. వర్షపాతం నమోదయింది. జిల్లాలో పలుచోట్ల వరి, పత్తి చేలు దెబ్బతిన్నాయని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేశారు.

శాంతికి విఘాతం కలిగిస్తే చర్యలు



మాట్లాడుతున్న డీఎస్పీ సత్తయ్య

పుల్కల్, న్యూస్‌టుడే: గ్రామంలో శాంతియుత వాతావరణానికి విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని సంగారెడ్డి డీఎస్పీ సత్తయ్య హెచ్చరించారు. పుల్కల్ మండల పరిధిలోని మిన్పూర్ గ్రామంలో ఆదివారం రాత్రి ఘర్షణ చోటుచేసుకుంది. గ్రామంలోని కొందరి మధ్య ఏర్పడిన గొడవ పెద్దగా మారింది. గ్రామస్థులు రెండు గ్రూపులుగా ఏర్పడి ఘర్షణలకు దిగడంతో స్థానికంగా ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు అక్కడికి చేరుకొని గొడవ సద్దుమణిగేలా చర్యలు తీసుకున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం డీఎస్పీ సత్తయ్య జోగిపేట ఆర్డీవో పాండుతో కలిసి ఇరువర్గాలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. అనవసర వివాదాలతో కేసుల్లో ఇరుక్కోవద్దని సూచించారు. ప్రజలు పోలీసులకు సహకరించాలని, సంయమనం పాటించాలని కోరారు. గ్రామానికి సంబంధించి ఎలాంటి ఇబ్బందులున్నా.. ఆయా శాఖల అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తహసీల్దారు కృష్ణ, సీఐలు అనిల్‌కుమార్, చంద్రయ్య, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

ఖాతాపై కేటుగాళ్ల కన్ను

● జిల్లాలో నిత్యం సైబర్ మోసాలు
● విద్యావంతులూ బాధితులే..

న్యూస్‌టుడే, సంగారెడ్డి అర్బన్

● పటాన్‌చెరు పోలీసు ఠాణా పరిధి గౌతమ్‌నగర్ కాలనీకి చెందిన ప్రైవేట్ ఉద్యోగికి జూన్ 15న వాట్సాప్ సందేశం వచ్చింది. అపరిచితులు పేర్కొన్న విధంగా ఐడీ క్రియేట్ చేసి వారికి పంపించారు. కొద్ది రోజులు వారు చెప్పిన విధంగా పెట్టుబడి పెట్టగా అధిక లాభాలు వచ్చాయని జమ చేశారు. ఆ తర్వాత మొత్తం రూ. 66.75 లక్షల వరకు పెట్టుబడి పెట్టగా.. అపరిచితుల నుంచి స్పందన రాలేదు. మోసపోయానని తెలుసుకొని బాధితుడు సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటన ఆగస్టులో చోటుచేసుకుంది.

● లింక్‌లు క్లిక్ చేస్తే డబ్బులు జమ చేస్తామని అపరిచితులు సందేశాలు పంపిస్తున్నారు. ఆ లింక్‌ను క్లిక్ చేయగానే ఖాతాల్లోని డబ్బులు మాయమవుతున్నాయి. ఇలాంటి మోసాలు జిల్లాలోని పటాన్‌చెరు, అమీన్‌పూర్, సంగారెడ్డి, జహీరాబాద్ ప్రాంతాల్లో ఎక్కువగా జరుగుతున్నాయి. వీరిలో బాధితులు ఎక్కువ మంది విద్యావంతులే.

ఈ ఏడాది నమోదైన 'సైబర్' కేసులు
(జనవరి నుంచి అక్టోబరు 21 వరకు)
- ఫిర్యాదులు: 3357
- పరిష్కారమైనవి: 640
- బాధితులు కోల్పోయిన నగదు: రూ.42.43 కోట్లు
- వాటిలో బాధితులకు తిరిగి జమచేసినవి: రూ.5.75 కోట్లు



అత్యాశే ప్రధాన కారణం

తక్కువ పెటుబడితో ఎక్కువ లాభాలు ఆర్జించవచ్చనే అత్యాశతో చాలామంది మోసపోతున్నారు. సైబర్ మోసగాళ్ల మాయమాటలు నమ్మి రూ.లక్షల్లో డబ్బు పోగొట్టుకుంటున్నారు. వీరిలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, వైద్యులు, విద్యార్థులు, పారిశ్రామికవేత్తలూ ఉంటున్నారు. బాధితులందరూ తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించాలనే అత్యాశతోనే మోసపోతున్నారని పోలీసులు చెబుతున్నారు.

రాష్ట్ర రాజధాని తర్వాత ఇక్కడే అత్యధికం

రాచకొండ, హైదరాబాద్, సైబరాబాద్ కమిషనరేట్ల తర్వాత సంగారెడ్డి జిల్లాలోనే అత్యధిక సైబర్ మోసాలు నమోదవుతున్నాయి. ప్రధానంగా అమీన్‌పూర్, పటాన్‌చెరు, సంగారెడ్డి, జహీరాబాద్, సదాశివపేట పోలీస్ స్టేషన్ల పరిధిలో నిత్యం అయిదు నుంచి పది వరకు సైబర్ నేరాలపై ఫిర్యాదులు వస్తున్నాయి. జిల్లాలోని ప్రతి ఠాణాలో ఇద్దరు చొప్పున సైబర్ వారియర్లు ఉంటున్నారు. సైబర్ కేసుల పరిష్కారానికి చొరవ చూపుతున్నారు. ప్రజలు సైబర్ మోసాలకు గురికాకుండా పోలీసులు చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. జిల్లాలో డీఎస్పీల పర్యవేక్షణలో సైబర్ నేరాల తగ్గుదలకు చర్యలు తీసుకుంటున్నారు.



అవగాహన కల్పిస్తున్న పోలీసులు

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఆన్‌లైన్‌లో కేటుగాళ్ల మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేసినా, సందేశం పంపించినా స్పందించవద్దు. వారి మాయమాటలు నమ్మవద్దు. అడ్డదారిలో తక్కువ వ్యవధిలో ఎక్కువ డబ్బులు సంపాదించాలనుకోవడం సరికాదు. బ్యాంకు ఖాతాల వివరాలు, ఓటీపీలను ఇతరులకు చెప్పవద్దు. ఎవరైనా సైబర్ మోసానికి గురయితే వెంటనే 1930 నంబర్‌కు ఫిర్యాదు చేయాలి. లేదంటే www.cybercrime.gov.inకు సమాచారం ఇవ్వాలి. **–వేణుగోపాల్‌రెడ్డి, డీఎస్పీ, సైబర్ నేరాల విభాగం.**

ఇది గమ్యస్థానం చేర్చే దారేనా..?



అందోలు మండల పరిధిలోని సంగుపేట నుంచి పుల్కల్ మండలం ఎస్.ఇటిక్యాల్, ముదిమాణిక్యానికి వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డు గుంతలమయంగా మారింది. ప్రయాణికులకు నరకాన్ని చూపిస్తోంది. వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. సంగుపేట నుంచి ముదిమాణిక్యం వరకు పది కిలోమీటర్ల మేరకు ఇదే పరిస్థితి నెలకొంది. ఈ మార్గంలో అందోలు, టేక్మాల్, చిలప్‌చెడ్, మెదక్ ప్రాంతాలకు చెందిన పర్యాటకులు సింగూరు ప్రాజెక్టుకు రాకపోకలు సాగిస్తుంటారు. అధికారులు ఇకనైనా దారికి మరమ్మతులు చేయించాలని పలువురు కోరుతున్నారు. ఈ విషయాన్ని ఆర్‌అండ్‌బీ డీఈఈ రవీందర్ దృష్టికి తీసుకెళ్లగా.. మరమ్మతుల నిధుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని, మంజూరైన వెంటనే పనులు చేపడతామని వివరించారు. –న్యూస్‌టుడే, జోగిపేట టౌన్.



నివాళి అర్పిస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి



పుష్పాంజలి ఘటిస్తున్న ఎస్పీ రూపేష్



కన్నీటి పర్యంతమవుతున్న అమరవీరుడి తల్లి లక్ష్మమ్మ

పోలీసు అమర వీరుల త్యాగాలు మరువలేం: కలెక్టర్



రక్షకభటుల నివాళులు

పోలీసు అమర వీరుల త్యాగాలు మరువలేమని జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి పేర్కొన్నారు. సోమవారం సంగారెడ్డి పోలీసు పరేడ్ మైదానంలో నిర్వహించిన పోలీసు అమర వీరుల సంస్మరణ దినోత్సవానికి ముఖ్య అతిథిగా ఆమె హాజరై ఎస్పీ రూపేష్‌తో కలిసి నివాళి అర్పించారు. శాంతిభద్రతల నిర్వహణలో పోలీసుల పాత్ర కీలకమని కొనియాడారు. ఎస్పీ మాట్లాడుతూ జిల్లాకు చెందిన నలుగురు వీర జవాన్లు వివిధ ఘటనల్లో ప్రాణాలు కోల్పోయారన్నారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరారు. అదనపు ఎస్పీ సంజీవరావు, డీఎస్పీలు సత్తయ్య గౌడ్, రాంమోహన్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, ఏఆర్ డీఎస్పీ నరేందర్, సైబర్ విభాగం డీఎస్పీ వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. –న్యూస్‌టుడే, సంగారెడ్డి అర్బన్.

రెండు వ్యవసాయ విపణులకు పాలకవర్గాల నియామకం



జగన్మోహన్‌రెడ్డి (జోగిపేట) కొప్పుల లక్ష్మి (వట్‌పల్లి)

జోగిపేట, వట్‌పల్లి, న్యూస్‌టుడే: జోగిపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా ఎం.జగన్మోహన్‌రెడ్డి, 13 మంది సభ్యులను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని మార్కెట్ కమిటీ కార్యదర్శి సునీల్ తెలిపారు. ఉపాధ్యక్షుడిగా ఎల్లంపల్లి సత్యనారాయణ, సభ్యులుగా డప్పు శంకర్, ఆర్.దనిబాయి, మహ్మద్ ఫారూక్ అలీ, పెద్దగొల్ల అశోక్, పి.మధుసూదన్‌రెడ్డి, దానంపల్లి బాలయ్య, ఘనపురం రాజేశ్‌గౌడ్, సంగమేశ్వర్, పి.కమల్‌రెడ్డి, ప్రతాప్‌సింహ, పి.నాగరాజులతో పాటు మరో నలుగురు సంబంధిత శాఖ అధికారులు సభ్యులుగా ఉంటారని పేర్కొన్నారు.

● వట్‌పల్లి వ్యవసాయ విపణి నూతన పాలకవర్గాన్ని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని ఏఎంసీ కార్యదర్శి సునీల్‌కుమార్ సోమవారం తెలిపారు. అధ్యక్షురాలిగా కొప్పుల లక్ష్మి, ఉపాధ్యక్షుడిగా మన్నె ఈశ్వరయ్య, సభ్యులుగా పాపయ్య, రాజు, అబ్దుల్ ఫజిల్, రాజుగౌడ్, సాయిలు, దిగంబర్‌రావు, అబీబుద్దీన్, భద్రారెడ్డి, సంగమేశ్వర్, లక్ష్మయ్య, నాగయ్య, శ్రీధర్‌తో పాటు నలుగురు అధికారులకు కమిటీలో చోటు కల్పించారు.

నత్తనడకన పది బోధన

న్యూస్‌టుడే, సంగారెడ్డి మున్సిపాలిటీ, జోగిపేట, కంది, సదాశివపేట

సర్కారు బడుల్లో 40 శాతమే సిలబస్ పూర్తి



పాఠశాలల విద్యార్థులకు బోధన, అభ్యసనకు సంబంధించి ప్రణాళికలు సక్రమంగా అమలు చేస్తేనే.. మెరుగైన ఫలితాలు సాధ్యమవుతాయి. నిర్దేశిత లక్ష్యాన్ని సులువుగా చేరుకోవచ్చు. ఆ దిశగా జిల్లాలోని సర్కారు బడుల్లో పదో తరగతి సిలబస్‌ను త్వరితగతిన పూర్తి చేసేందుకు విద్యాశాఖ కసరత్తు ఆరంభించింది. అక్టోబరు నాటికి 60 శాతం సిలబస్ పూర్తి చేయాల్సి ఉండగా.. ఇప్పటి వరకు 40 శాతం మాత్రమే సిలబస్ పూర్తయింది.

ప్రభుత్వ పాఠశాలల్లో 'పది' విద్యార్థులు ఇలా..

జడ్పీ, ఉన్నత	203
కేజీబీవీ	22
ఆదర్శ	10
మొత్తం విద్యార్థులు	12,100

ఇకనైనా దృష్టి సారిస్తేనే..

విద్యాశాఖ నిర్దేశించిన ప్రణాళిక ప్రకారం డిసెంబరు చివరి నాటికి పదో తరగతి విద్యార్థులకు సిలబస్ మొత్తాన్ని పూర్తి చేయాలి. విద్యార్థులకు పునశ్చరణ తరగతులు ప్రారంభించాలి. విద్యా సంవత్సరం ఆరంభంలో బదిలీలు, పదోన్నతుల కారణంగా కొన్నాళ్లు బోధనకు ఆటంకం కలిగింది. దీంతో సిలబస్‌లో కొంత వెనుకబడింది. బదిలీలు, పదోన్నతులు పూర్తి కావడంతో పాటు కొత్త ఉపాధ్యాయులు రావడంతో ఆ లోటు భర్తీ చేసేందుకు జిల్లా అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. సమ్మేటివ్-1 పరీక్షల అనంతరం సిలబస్‌ను వేగంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో 12 వేలకు పైగా విద్యార్థులు చదువుతున్నారు. కొన్ని చోట్ల 35 శాతం సిలబస్ కూడా పూర్తికాలేదు. వాటిపై మరింత దృష్టి సారించాల్సిన ఆవశ్యకత ఉంది.

కార్యాచరణ అమలు చేస్తాం

నిర్దేశిత వ్యవధిలో సిలబస్‌ను పూర్తి చేస్తాం. వెనుకబడిన పాఠశాలలపై ప్రత్యేక దృష్టి సారిస్తాం. కార్యాచరణను పక్కాగా అమలు చేస్తాం. నిత్యం పాఠశాలలను సందర్శిస్తాం. బోధన సకాలంలో పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటాం. వచ్చే నెల నుంచి ఉదయం, సాయంత్రం అదనంగా గంటపాటు పాఠ్యాంశాల బోధనకు కేటాయిస్తారు. జనవరి నుంచి పునశ్చరణ తరగతులు ప్రారంభించేలా సన్నాహాలు చేస్తున్నాం.
–వెంకటేశ్వర్లు, జిల్లా విద్యాధికారి.

ఉమ్మడి మెదక్ జిల్లా క్రికెట్ జట్ల ఎంపిక

సంగారెడ్డి టౌన్, న్యూస్‌టుడే: సంగారెడ్డిలోని జూబ్లీ క్లబ్-ఎంఎస్ అకాడమీలో ఉమ్మడి మెదక్ జిల్లా క్రికెట్ జట్ల ఎంపికలు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా క్రికెట్ అసోసియేషన్ ఉమ్మడి మెదక్ జిల్లా కార్యదర్శి రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ. . హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నవంబరు 4న సంగారెడ్డి, వరంగల్‌లో ప్రారంభమయ్యే అండర్-23 అంతర్ జిల్లాల పోటీల్లో పాల్గొనే నాలుగు జట్లను ఎంపిక చేశామని, ఇందులో అత్యుత్తమ ప్రతిభ చాటిన వారితో తుది జట్టును ప్రకటిస్తామన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

సింగూరు నీటి విడుదల

పుల్కల్, న్యూస్‌టుడే: మండల పరిధిలోని సింగూరు ప్రాజెక్టు నుంచి సోమవారం నీటిని దిగువకు విడుదల చేశారు. ఎగువ నుంచి వరద ప్రవాహం ఉండటంతో ప్రాజెక్టు 6వ నంబరు గేటును 2 మీటర్లు ఎత్తి.. 12,000 క్యూసెక్కులను దిగువకు వదులుతున్నారు. ప్రస్తుతం ఇన్‌ఫ్లో 5241 క్యూసెక్కులు. జలాశయం గత నెలలోనే 30 టీఎంసీల పూర్తి సామర్థ్యానికి చేరుకుంది. దిగువ ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పశువుల కాపరులు, మత్స్యకారులు నదిలోకి దిగవద్దని ఏఈ మహిపాల్‌రెడ్డి సూచించారు. సింగూరు జల విద్యుదుత్పత్తి కేంద్రంలో రెండు యూనిట్ల ద్వారా విద్యుదుత్పత్తి కొనసాగుతోంది.

రైతులకు న్యాయం చేయాలని ధర్నా

జిన్నారం, న్యూస్‌టుడే: పరిశ్రమల ఏర్పాటు కోసం తీసుకున్న రైతుల భూమికి.. ల్యాండ్ పూలింగ్ చట్టం ప్రకారం స్థలాలు ఇచ్చి న్యాయం చేయాలని భారాస డిమాండ్ చేసింది. సోమవారం జిన్నారంలో రైతులతో ర్యాలీ నిర్వహించిన అనంతరం రెవెన్యూ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం తహసీల్దార్ భిక్షపతికి వినతిపత్రం అందజేశారు. జిన్నారం పరిధి 1001 సర్వే నంబర్‌తో పాటు.. జంగంపేటలోని 376 సర్వే నంబర్‌కు సంబంధించిన స్థలాలను గతంలో పరిశ్రమల స్థాపనకు ప్రభుత్వం తీసుకుందన్నారు. ఎకరాకు 600 గజాల చొప్పున పట్టా స్థలం ఇస్తామని అప్పట్లో అధికారులు ప్రకటించారని, ఇప్పటికీ అమలు చేయలేదన్నారు. ఇకనైనా న్యాయం చేయాలని కోరారు.

నేటి తరం కృత్రిమ మేధస్సుదే

మెదక్ అర్బన్, న్యూస్‌టుడే: నేటి తరం కృత్రిమ మేధస్సుదేనని ఆర్‌ఎస్‌ఎల్ కంపెనీ డైరెక్టర్ రాజ్‌కుమార్ అన్నారు. సోమవారం మెదక్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ విభాగం, ఆర్‌ఎస్‌ఎల్ టెక్నాలజీస్ హైదరాబాద్ సంయుక్త ఆధ్వర్యంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, పైథాన్ లాంగ్వేజీలపై కార్యశాల నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌ఎస్‌ఎల్, ఏఐ టెక్నాలజీ, పైథాన్ ప్రోగ్రామ్‌ల గురించి వివరించామన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల జిల్లా కార్యవర్గం ఎన్నిక



సంజీవరావు

సంగారెడ్డి అర్బన్, న్యూస్‌టుడే: గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. సంగారెడ్డి పట్టణం పోతిరెడ్డిపల్లిలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో కార్యక్రమం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడిగా ఎల్.సంజీవరావు, ప్రధాన కార్యదర్శిగా ఎస్.రవీందర్‌రెడ్డి, కోశాధికారిగా కె.పుండ్లీక్, గౌరవ అధ్యక్షుడిగా పి.సుధాకర్‌లను ఎన్నుకున్నట్లు వివరించారు. సమావేశంలో సంబంధిత సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజగంగారెడ్డి, రాష్ట్ర కోశాధికారి బి.తుకారాం, పరిశీలకులుగా మదన్‌మోహన్, సత్యం పాల్గొన్నారు.

విచారణతో సరి.. నివేదిక ఎప్పుడో మరి!

న్యూస్‌టుడే, జిన్నారం: జిన్నారం మండలం కిష్టాయపల్లిలో ఆగస్టులో 20 గేదెలు మృతి చెందడం కలకలం రేపింది. కలుషిత జలాలు తాగి మృతి చెందాయని బాధితులు, గ్రామస్థులు ఆరోపించారు. విచారణ నివేదిక వచ్చాకే గుర్తించవచ్చని అధికారులు పేర్కొన్నారు. ఈ మేరకు పశుసంవర్ధక శాఖ, పోలీసులు, రెవెన్యూ అధికారులు పరిశీలించి, నమూనాలను ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్ (ఎఫ్ఎస్ఎల్)కు పంపారు. ఇది జరిగి రెండు నెలలు కావొస్తున్నా నివేదికలో ఏముందో తెలియలేదు. ఆగస్టులో కిష్టాయపల్లికి చెందిన బశెట్టిగారి సంతోష్‌కుమార్‌కు చెందిన సుమారు 20 గేదెలు మృతి చెందాయి. సనత్‌నగర్‌లోని పీసీబీ ప్రధాన కార్యాలయం ఎదుట బాధితులు ఆందోళన చేశారు. సమస్యపై ఉన్నత స్థాయి కమిటీని నియమిస్తామని పీసీబీ హామీ ఇచ్చి, గ్రామస్థులు, నాయకులతో సమావేశం నిర్వహించింది. గేదెల మృతికి కారణాలు తెలియాలంటే ఎఫ్ఎస్ఎల్ నివేదిక రావాల్సిందేనని స్పష్టం చేసింది. ఐడీఏ బొల్లారం పోలీసులు విచారణ చేసి నమూనాలు నగరంలోని ఎఫ్ఎస్ఎల్‌కు పంపారు. నివేదిక రావడం ఆలస్యం కావడంతో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నివేదికలో రసాయన జలాల వల్లేనని తేలితే పరిశ్రమలపై చర్యలు తీసుకోవాల్సిందే. అందువల్లే నివేదిక బయటకు రాకుండా అడ్డుకుంటున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. పశువైద్యాధికారులు కూడా కొన్ని నమూనాలు పోలీసులకు ఇచ్చారు. వాటిని ల్యాబ్‌కు పంపారు. రసాయనాల వల్లే మరణాలని తేలింది. ఇక ఎఫ్ఎస్ఎల్ నివేదికే చివరిది. నివేదికలు ఇంకా అందలేదని ఐడీఏ బొల్లారం ఎస్సై దశరథ, జిన్నారం పశువైద్యాధికారి డాక్టర్ విశ్వచైతన్య తెలిపారు.

వెయిట్ లిఫ్టింగ్ రాష్ట్ర స్థాయి జట్టుకి ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో ప్రధానోపాధ్యాయురాలు, పీడీ..

కొండాపూర్, న్యూస్‌టుడే: కొండాపూర్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న ముగ్గురు విద్యార్థులు నందిని, మస్కాన్, ముజీబ్‌లు వెయిట్ లిఫ్టింగ్ వేర్వేరు విభాగాల్లో రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయురాలు ఎలిజబెత్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల కరీంనగర్‌లో నిర్వహించిన పోటీల్లో ప్రతిభ చూపడంతో ఎంపికయ్యారని వివరించారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను ప్రధానోపాధ్యాయురాలితో పాటు పీడీ కృష్ణ, ఉపాధ్యాయులు అభినందించారు.

పటాన్‌చెరు ప్రాంతీయ ప్రభుత్వ ఆసుపత్రికి పురస్కారం

పటాన్‌చెరు అర్బన్, న్యూస్‌టుడే: పటాన్‌చెరు ప్రాంతీయ ప్రభుత్వాసుపత్రి వైద్యసేవలతో పాటు వివిధ విభాగాల్లో జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచింది. మూడు నెలల క్రితం వచ్చిన కేంద్ర బృందం ఇక్కడి వైద్యసేవలు, నిర్వహణ, పరిశుభ్రత-పచ్చదనం వంటి అంశాలను పరిశీలించింది. 95 శాతానికి పైగా నాణ్యతా ప్రమాణాలను పాటిస్తున్నట్లు గుర్తించింది. వారిచ్చిన నివేదిక ఆధారంగా పురస్కారానికి ఎంపిక చేశారు.

పరిశోధనలతో ఊతం.. అన్నదాతకు ఫలం

న్యూస్‌టుడే, సంగారెడ్డి టౌన్

అండగా నిలుస్తున్న ఎఫ్ఆర్ఎస్

రైతులు దుక్కులు దున్నాలి.. వరుణుడి కటాక్షం కోసం ఆకాశం వైపు చూడాలి. అధిక వర్షాలు కురిసినా, వరుణుడి కరుణ లేకున్నా.. అన్నదాత శ్రమకు ఫలితం దక్కదు. వ్యయప్రయాసలకు తట్టుకొని పంటలు పండించినా గిట్టుబాటు ధర అనుమానమే. పండ్ల తోటల్లో అయితే రైతులకు ఈ సమస్య ఉండదు. దీన్ని దృష్టిలో ఉంచుకొని ఎక్కువ మంది రైతులు తోటల పెంపకం దిశగా ముందుకు సాగుతున్నారు. ఆసక్తి ఉన్న రైతుల్ని సంగారెడ్డిలోని కొండా లక్ష్మణ్ ఫల పరిశోధన స్థానం ప్రోత్సహిస్తోంది.

ఇదీ ప్రత్యేకత: సంగారెడ్డిలోని ఫల పరిశోధన స్థానానికి ప్రత్యేక గుర్తింపు ఉంది. నిజాం కాలంలో ఇది గుర్రపుశాలగా ఉండేది. ఆ తర్వాత ఫల పరిశోధన స్థానంగా మార్చారు. అన్నదాతలకు చేదోడుగా ఉండేలా ఇక్కడ శాస్త్రవేత్తలు నిరంతరం పరిశోధనలు చేస్తున్నారు. పంటలకు ఏమైనా చీడపీడలు సోకితే నివారణ చర్యలపై రైతుల్ని అప్రమత్తం చేస్తుంటారు.



నాణ్యమైన మొక్కలకు నర్సరీ

ఎఫ్ఆర్ఎస్‌లో 50 హెక్టార్లకు పైగా విస్తీర్ణంలో వివిధ రకాలు తోటలు ఉన్నాయి. ఇందులో అత్యధికంగా మామిడి 42.20 హెక్టార్ల విస్తీర్ణంలో ఉంది. 470 మామిడి రకాలు ఇక్కడ ఉండటం విశేషం. జామ, సీతాఫలం, సపోటా తోటలు కూడా ఉన్నాయి. రైతులకు నాణ్యమైన మొక్కలు అందించాలనే లక్ష్యంతో నర్సరీలను సైతం నిర్వహిస్తున్నారు. అత్యధికంగా మామిడి మొక్కల్ని పెంచుతున్నారు. జూన్ నాటికి నాటేందుకు వీలుగా సిద్ధం చేస్తారు. కరోండా, ప్యాషన్ ఫ్రూట్, నిమ్మ, జామ, సీతాఫలం మొక్కలు అందుబాటులో ఉంటాయి. మొక్కల్ని అంటుకట్టేందుకు పుల్లల సేకరణకు ఇబ్బంది లేకుండా ప్రత్యేకంగా 10 ఎకరాల విస్తీర్ణంలో మదర్ బ్లాక్(తల్లి మొక్కలు)ను ఇక్కడ ఏర్పాటు చేశారు.

రైతుల ప్రయోజనాలకు ప్రాధాన్యం

రైతుల ప్రయోజనాలకు పెద్దపీట వేస్తున్నాం. తక్కువ పెట్టుబడి అధిక దిగుబడులపై పరిశోధనలు కొనసాగుతున్నాయి. నాణ్యమైన మొక్కల్ని నర్సరీల్లో పెంచుతున్నాం. తోటలు వేసుకునే వారు ఇక్కడి నుంచి కొనుగోలు చేస్తే మెరుగైన ఫలితాలు ఉంటాయి. ఎఫ్ఆర్ఎస్ నుంచి మొక్కల కొనుగోలుకు ఇతర రాష్ట్రాల నుంచి సైతం వస్తుంటారు. డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకొని నర్సరీలో పెంచే మొక్కల సంఖ్యను పెంచుతున్నాం.
–సుచిత్ర, ఎఫ్ఆర్ఎస్ ప్రధాన శాస్త్రవేత్త.

స్వల్పకాలం.. దిగుబడి ఖాయం

ఆలు సాగులో మెలకువలతో..


బోదెల్లో నాటుతున్న విత్తనం

న్యూస్‌టుడే, జహీరాబాద్

ఆలుగడ్డ శీతాకాలంలో పండించే స్వల్పకాలిక పంట. తక్కువ నీరే అవసరం ఉంటుంది. ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల్లో దీన్ని సాగు చేస్తుంటారు. అక్టోబరు, నవంబరు నెలలు సాగుకు అనుకూలం. విత్తనం నాటినప్పటి నుంచి కోతకు వచ్చే వరకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను జహీరాబాద్‌లోని కృషివిజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త కె.శైలజ ఇలా వివరించారు.

లోతు దుక్కితో..: పొలాన్ని లోతుగా దున్ని బాగా ఎండనివ్వాలి. దీనివల్ల నేలలో ఉండే శిలీంధ్రాలు, కలుపు గింజలు చనిపోతాయి. ఆఖరి దుక్కిలో ఎకరానికి 10 నుంచి 12 టన్నుల పశువుల ఎరువు, 20 కిలోల మలాథియాన్ పొడి చల్లి కలియదున్నాలి.

విత్తన రకాలు

కుఫ్రి చంద్రముఖి: గడ్డ గోధుమ రంగులో ఉంటుంది. పంట కాలం 90 నుంచి 95 రోజులు.

కుఫ్రి లవకర్: స్వల్పకాలిక రకం. దుంప తెల్లగా ఉండటమే కాకుండా 70 నుంచి 75 రోజుల్లో పంట చేతికొస్తుంది.

కుఫ్రి జ్యోతి: ఈ రకం విత్తనం మధ్యకాలిక రకం. దుంప తెల్లగా ఉంటూ ఎర్లీబ్లైట్, లేట్‌బ్లైట్ తట్టుకుంటుంది. పంట కాలం 90 నుంచి 100 రోజులు.

శుద్ధి తప్పనిసరి: 20 నుంచి 30 గ్రా. బరువున్న దుంపలను విత్తనంగా వినియోగించాలి. వెలుతురు ఉన్న ప్రదేశంలో ఒక రోజు ఆరబెట్టాలి. దుంపను రెండు, మూడు ముక్కలుగా కోసి లీటరు నీటిలో 2 గ్రా. చొప్పున మాంకోజెట్ కలిపి 10 నిమిషాలు నానబెట్టాలి. ఆ తర్వాత గోనె సంచులు కప్పి 24 గంటలు ఆరబెట్టాలి. 50 సెం.మీ. దూరం పాటిస్తూ బోదెలు తవ్వి నాటాలి. ● నత్రజని 16 కిలోలు, భాస్వరం 24 కిలోలు, పొటాష్ 20 కిలోలు ఎకరాలో బోదెల వెంట వేయాలి. అజోస్పైరిలమ్, పాస్ఫోబ్యాక్టీరియా 2 కిలోల చొప్పున పశువుల ఎరువుతో కలిపి వేస్తే తెగుళ్ల బెడద ఉండదు. విత్తిన 30 రోజులకు 16 కిలోల నత్రజని, 20 కిలోల పొటాష్ వేసి మన్ను ఎగదోసి నీరు అందించాలి. 50 రోజులకు ఇదే మోతాదులో వాడాలి.

నీటి తడులు..: విత్తనం నాటిన ఐదారు రోజుల్లో 2, 3 తడులు అందిస్తే బాగా మొలకెత్తుతాయి. లేదంటే పొటాటో ట్యూబర్‌మాత్ బెడద తీవ్రం అవుతుంది. మొక్క పెరిగే దశలో 7, 8 రోజులకో సారి, దుంప ఏర్పడే దశలో 4, 5 రోజులకోసారి నీరు పారించాలి.

రైతేరాజు

సాగులో సందేహాలా?

సంప్రదించాల్సిన ఫోన్ నం: 93815 15588

సాగు పద్ధతులు, చీడపీడల నివారణ, సస్యరక్షణపై రైతుల ప్రశ్నలకు సిద్దిపేట తోర్నాల వ్యవసాయ పరిశోధన కేంద్రం సమన్వయకర్త విజయ్ సమాధానాలు ఇచ్చారు.

ప్రశ్న: పత్తి ఆకుల ఈనెలు నల్లగా మారుతున్నాయి. ఏం చేయాలి? – విజయ్, గజ్వేల్

సమాధానం: కాపర్‌ఆక్సీక్లోరైడ్ 3 గ్రా.లు, స్ట్రెప్టోసైక్లిన్ 2 గ్రా.ల మందును 10 లీటర్ల నీటికి కలిపి పిచికారీ చేయాలి. పైరు ఎదుగుదలకు ఎకరాకు 25 కిలోల యూరియా, 10 కిలోల పొటాష్ మొక్కలకు అందిస్తే ఫలితం ఉంటుంది. – న్యూస్‌టుడే, చేర్యాల

మామిడిలో చెదల నివారణ

మామిడి తోటల్లో అక్టోబరు చివరి, నవంబరు మొదటి వారం నుంచి పూత రావడం ప్రారంభం అవుతుంది. దీనికితోడు చెదలు పట్టడం, క్రిమికీటకాలు చేరడమూ మొదలవుతుంది. ఈ దశలో పూతను సకాలంలో సంరక్షించుకుంటే అధిక దిగుబడులు సాధ్యం. చెదలు పట్టడం, క్రిమికీటకాల బెడద నుంచి బయటపడేందుకు 100 లీటర్ల నీటిలో 8 కిలోల రాళ్ల సున్నం, 3 కిలోల కాపర్ ఆక్సీక్లోరైడ్ లేదా క్లోరోఫైరిఫాస్ మందు కలిపి ఒక రోజు మందు నానబెట్టాలి. ఇలా తయారైన మిశ్రమాన్ని చెట్టు కింది నుంచి రెండున్నర అడుగుల మేర మొదలు చుట్టూ పూయాలి. చెట్టుకు అవసరమైన వేడి అందుతుంది.

– న్యూస్‌టుడే, పాపన్నపేట

వేరుసెనగ పంట... లాభాలు ఇంట



సాంకేతిక పరిజ్ఞానం పాటిస్తూ, అధికారుల సూచనలతో ముందుకు సాగితే ఏ పంటలోనైనా అధిక లాభాలు ఖాయం. ఈ బాటలో నడుస్తూ వేరుసెనగ పండిస్తూ లాభాలు ఆర్జిస్తున్నారు ధారూర్ మండలం ధారూర్ స్టేషన్‌కు చెందిన పాండు. 25 ఏళ్ల కిందట ఈయన తాత దీన్ని సాగు చేయగా.. అదే సంప్రదాయాన్ని ఈయన సైతం కొనసాగిస్తున్నారు. ఈయనకు ఆరెకరాల పొలం ఉంది. ప్రతి సారి దీన్ని సాగు చేసే ముందు జనుము, పిల్లిపెసర వంటి పచ్చిరొట్టె ఎరువు పంటలను వేస్తారు. ఇవి ఏపుగా పెరిగాక కలియదున్నుతారు. దీనివల్ల భూసారం పెరిగి అధిక దిగుబడి వచ్చేందుకు దోహదపడుతోంది.

ఎకరాకు రూ.30 వేలు..

ఎకరాకు 70 కిలోల చొప్పున 6 ఎకరాలకు 420 కిలోల విత్తనం అవసరం అవుతోంది. కలుపు తీత, ఎరువులు, పురుగుమందులు తదితరాలకు ఎకరాకు రూ.30 వేల వరకు ఖర్చవుతోంది. పంట పూతదశకు నెల రోజుల ముందు జిప్సం చల్లడం వల్ల ఊడలు సులువుగా భూమిలోకి వెళ్లి కాయ పరిమాణం, నూనె శాతం పెరుగుతుంది. నీటి తడులు అందించేందుకు తుంపర పద్ధతిని ఎంచుకున్నారు. అన్ని విధాల సస్యరక్షణ చర్యలు చేపడుతుండటంతో ఎకరాకు 12 క్వింటాళ్ల దిగుబడి వస్తోంది. మార్కెట్లో క్వింటా ధర రూ.7500 పలుకుతోంది. ఈ లెక్కన ఆరెకరాలకు కలిపి రూ.5.40 లక్షల వరకు ఆదాయం వస్తోంది. పెట్టుబడి పోగా రూ.3.60 లక్షల వరకు మిగులుతోందని పాండు తెలిపారు. – న్యూస్‌టుడే, ధారూర్

బెండలో అంతరకృషితో ఫలితం

బెండ తోటలో కలుపును సకాలంలో తొలగించకపోతే పంట నష్టపోక తప్పదు. విత్తనాలు వేయగానే ఎకరాకు పెండిమిథాలిన్ 30 శాతం లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. 25 రోజుల తర్వాత గొర్రు లేదా గుంటకతో అంతర కృషి చేసుకోవాలి. దీనివల్ల కలుపును సులువుగా నివారించుకోవచ్చు.

– న్యూస్‌టుడే, పెద్దశంకరంపేట

నిమ్మలో గజ్జి తెగులా..

వాతావరణంలో వస్తున్న మార్పులతో నిమ్మ తోటకు గజ్జి తెగులు ఆశిస్తుంది. దీనివల్ల పంటకు తీవ్ర నష్టం వాటిల్లుతుంది. ప్రస్తుతం కురుస్తున్న వానలతో ఈ తెగులు తోటంతా త్వరగా వ్యాప్తి చెందే అవకాశం ఉంది. దీన్ని గుర్తించగానే సోకిన కొమ్మలను కత్తిరించి కాల్చేస్తే వ్యాప్తి చెందకుండా ఉంటుంది. నివారణకు పది లీటర్ల నీటిలో ఓ గ్రాము స్ట్రెప్టోసైక్లిన్, 30 గ్రాముల కాపర్‌ఆక్సీక్లోరైడ్ కలిపి 20 రోజులకోసారి వర్షాలు పూర్తిగా తగ్గే వరకు పిచికారీ చేసుకుంటే ఫలితం ఉంటుంది.

– న్యూస్‌టుడే, గజ్వేల్ గ్రామీణ

వృక్ష విలాపం!





పర్యావరణ సమతుల్యానికి వృక్షాలు ఎంతో దోహదం చేస్తాయి. ఏళ్లుగా మొక్కలు నాటి రక్షిస్తుంటేనే ఇది సాధ్యమవుతుంది. మెదక్ జిల్లా అల్లాదుర్గం మండలం చిల్వేర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో ఏళ్ల కిందట అప్పటి ఉపాధ్యాయులు, విద్యార్థులు మొక్కలు నాటి కంటికి రెప్పలా కాపాడారు. అవి ఏపుగా పెరిగి పిల్లలకు చల్లని నీడను అందిస్తున్నాయి. బడి రూపురేఖలను మార్చేశాయి. ఇన్నాళ్లు పచ్చదనానికి తోడ్పడిన పాఠశాల ఆవరణలోని 100కు పైగా వృక్షాలను దసరా సెలవుల్లో నరికేశారు. దీంతో కళావిహీనంగా మారింది. దీనిపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లక్ష్మణ్‌ను వివరణ కోరగా.. వాన కురుస్తున్నప్పుడల్లా నీళ్లు నిలిచిపోతుండటంతో మొరం పోయిస్తున్నామని, చెట్ల ఆకులు పడి చెత్తాచెదారం నిండుతోందని, అందుకే తొలగించామని చెప్పారు. మళ్లీ నాటుకోవచ్చని సమాధానం ఇచ్చారు.

– న్యూస్‌టుడే, అల్లాదుర్గం

పరస్పర సహకారంతో ప్రగతికి బాటలు

-జపాన్ సైన్స్ టెక్నాలజీ ఏజెన్సీ అధ్యక్షులు కజుహితో హోషిమోటో


కార్యక్రమంలో జపాన్ విద్యా సంస్థల ప్రతినిధులు, చిత్రంలో జపాన్ సైన్స్, టెక్నాలజీ(జేఎస్టీ) ఏజెన్సీ అధ్యక్షులు కజుహితో హోషిమోటో, ఐఐటీహెచ్ డైరెక్టర్ ప్రొఫెసర్ బి.ఎస్.మూర్తి

సంగారెడ్డి టౌన్: పరస్పర సహకారంతో ప్రగతికి బాటలు పడతాయని జపాన్ సైన్స్ టెక్నాలజీ(జేఎస్టీ) ఏజెన్సీ అధ్యక్షులు కజుహితో హోషిమోటో పేర్కొన్నారు. జపాన్ మంత్ పేరుతో రెండు రోజుల కార్యక్రమాన్ని ఆయన ఐఐటీ హైదరాబాద్‌లో సోమవారం ప్రారంభించి మాట్లాడారు. జపాన్ అకడమిక్ దినోత్సవాన్ని పురస్కరించుకొని 'జపాన్ నెల' కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 2014 నుంచి ఇండియాతో జేఎస్టీకి మెరుగైన సంబంధాలు ఉన్నాయన్నారు. ఇరుదేశాల మధ్య శాస్త్ర, సాంకేతిక అంశాలను ఇచ్చిపుచ్చుకోవడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు పేర్కొన్నారు. జేఎస్టీ ఆధ్వర్యంలో ఇండియాకు చెందిన యువ శాస్త్రవేత్తలకు జపాన్‌లో పర్యటించే అవకాశం కల్పిస్తున్నామన్నారు. జపాన్‌లో చదివేందుకు వస్తున్న భారతీయుల్లో 5శాతం ఐఐటీహెచ్‌కు చెందిన వారేనని వివరించారు. ఉత్పత్తులపరంగా జపాన్ బలంగా ఉందని, ఇండియా-జపాన్ కలిసి ముందుకు సాగితే శాస్త్ర సాంకేతిక రంగాల్లో అద్భుతాలు ఆవిష్కృతం అవుతాయన్నారు. జపాన్ మంత్‌లో భాగంగా తమ దేశానికి చెందిన 72 విద్యా సంస్థల ప్రతినిధులు హాజరైనట్లు వివరించారు. ఐఐటీహెచ్ డైరెక్టర్ ప్రొఫెసర్ బి.ఎస్.మూర్తి మాట్లాడుతూ జపాన్‌తో ఐఐటీహెచ్‌కు బలమైన సంబంధాలు ఉన్నాయని, ఇది రెండు దేశాలకు ప్రయోజనమని పేర్కొన్నారు.

ప్రభుత్వ పథకాలపై అధ్యయనం

మెదక్ జిల్లాలో సివిల్ సర్వీసెస్ శిక్షణ అధికారుల పర్యటన


ఆవంచలో బతుకమ్మ ఆడుతున్న శిక్షణ అధికారులు

తూప్రాన్, నర్సాపూర్ రూరల్, కౌడిపల్లి, రామాయంపేట, న్యూస్‌టుడే: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలు అమలు, వాటి సత్ఫలితాలపై అఖిల భారత సర్వీస్ శిక్షణ అధికారులు మెదక్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో అధ్యయనం చేయనున్నారు. సోమవారం నాలుగు మండలాల్లోని 4 గ్రామాల్లో వారి పర్యటన మొదలైంది. వారికి ఆయా గ్రామాల ప్రజలు, స్థానిక అధికారులు ఘన స్వాగతం పలికారు. నాలుగు రోజుల పాటు అక్కడే ఉండి అధ్యయనం చేయనున్నారు. ప్రజలతో మాట్లాడి పథకాల అమలు తీరుపై ఆరా తీయనున్నారు. తూప్రాన్ మండలం మల్కాపూర్‌కు ఐదుగురు అధికారులు వచ్చారు. ఆ బృందం నాయకురాలు, ఐపీఎస్ అధికారిణి సాహిత్య ఆధ్వర్యంలో వారు పర్యటించనున్నారు. తూప్రాన్ ఎంపీడీవో శేషాద్రి, డీఎల్పీవో యాదయ్య, ఎంఈవో సత్యనారాయణ తదితరులు ఉన్నారు. ● నర్సాపూర్ మండలం ఆవంచలో సోనుపర్మార్, ప్రియాంక, అరుణ్‌కుమార్ సింగ్, భోంస్లే అక్షయ్‌దినకర్, మనీష్‌కన్సాల్ క్షేత్రస్థాయిలో పర్యటించనున్నారు. వారికి మంగళహారతులతో ఘనస్వాగతం పలకగా, గ్రామస్థులతో కలిసి బతుకమ్మ ఆడారు. వైద్యురాలు ఫౌజియా, ఏపీవో అంజిరెడ్డి, ఏపీఎం గౌరిశంకర్, ఎంఈవో తారాసింగ్ తదితరులు ఉన్నారు.

● కౌడిపల్లి మండలం రాయిలాపూర్‌కు యోగేశ్‌కుమార్, హితేశ్ ఖండేల్‌వాల్, ఆశిష్‌కుమార్, మోహినుల్లా అన్సారీ, సౌవిక్ బృందం వచ్చింది. రామాయంపేట మండలం ప్రగతి ధర్మారానికి మరో నలుగురు శిక్షణ అధికారులు వచ్చారు. ఎంపీడీవో షాజీలొద్దీన్, తహసీల్దారు రజని, ఏవో రాజ్‌నారాయణలు వారికి స్వాగతం పలికారు.

యువ పర్యాటకం.. అభివృద్ధికి దోహదం



న్యూస్‌టుడే, మెదక్ టౌన్, సిద్దిపేట, సంగారెడ్డి టౌన్

యువతకు దేశ, రాష్ట్ర భౌగోళిక విశిష్టతలు, విభిన్న సంస్కృతులపై అవగాహన పెంచడమే లక్ష్యంగా ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా కేంద్ర ప్రభుత్వం.. పర్యాటక శాఖతో కలిసి యువ పర్యాటక క్లబ్‌ల ఏర్పాటుకు సంకల్పించింది. దేశంలోని చారిత్రక, పర్యాటక ప్రాంతాల అభివృద్ధిలో యువతను భాగస్వాములను చేయాలన్న ఉద్దేశంతో ఈ దిశగా అడుగేసింది. వీటిల్లో చేరే వారికి సాంస్కృతిక రాయబారులుగా తీర్చిదిద్దేలా కార్యాచరణ రూపొందించడం విశేషం.

ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల్లో సందర్శనీయ ప్రాంతాలెన్నో ఉన్నాయి. సిద్దిపేట కోమటిచెరువు, వికారాబాద్‌లోని అనంతగిరి అటవీ ప్రాంతం, మెదక్‌లో ఏడుపాయల ఆలయం, నర్సాపూర్ అటవీ ప్రాంతం, సంగారెడ్డిలో మంజీరా తదితర ప్రాంతాల సందర్శనకు నిత్యం వేలాది మంది వస్తుంటారు. వీటితో పాటు రాష్ట్రంలోని వివిధ పర్యాటక స్థలాలు, అక్కడి చారిత్రక వైభవం అధ్యయనం చేయడంతో పాటు అభివృద్ధిలో భాగస్వామ్యం అయ్యేలా క్లబ్ సభ్యులు దోహదపడతారు. మరోవైపు సందర్శకులకు అవగాహన కల్పించే బాధ్యత వీరిపై ఉంటుంది. నాలుగు

నాలుగు జిల్లాల్లో క్లబ్‌లు ఏర్పాటు

జిల్లా	విద్యాలయాలు	సభ్యులు
మెదక్	189	3830
సిద్దిపేట	112	2240
సంగారెడ్డి	250	2500
వికారాబాద్	130	2600


మెదక్ చర్చి వద్ద విద్యార్థులు

జిల్లాల్లో క్లబ్‌ల ఏర్పాటు ముమ్మరంగా సాగుతోంది.

అన్ని విద్యాసంస్థల్లో..

ప్రతి ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల్లో యువ పర్యాటక క్లబ్‌లు ఏర్పాటుచేయనున్నారు. క్లబ్‌కు పాఠశాల ప్రిన్సిపల్ అధ్యక్షుడిగా, ఉపాధ్యాయుడు/అధ్యాపకుడు సమన్వయకర్తగా వ్యవహరిస్తారు. పాఠశాలల్లో 7-9 తరగతులకు చెందిన విద్యార్థులు, కళాశాలల్లో ఆయా గ్రూప్‌లకు సంబంధించిన విద్యార్థులు 20 మంది వరకు సభ్యులుగా ఉంటారు. ప్రతి నెలా ఒకసారి సమావేశమై సభ్యులకు పర్యాటక అంశాలపై దిశానిర్దేశం చేస్తారు. ఆ నెలకు సంబంధించి ప్రణాళిక రూపొందించుకుంటారు. క్లబ్‌ల రిజిస్ట్రేషన్ ప్రక్రియ నిమిత్తం జిల్లాల డీఆర్డీవోలకు ప్రత్యేకంగా లింకు పంపించారు.

నిర్వహించే కార్యక్రమాలు



● పట్టణాలు, గ్రామాలకు సమీపంలో ఉన్న పర్యాటక కేంద్రాల వరకు ట్రెక్కింగ్, సైకిల్ ర్యాలీలు నిర్వహిస్తారు. ● వ్యాస రచన, క్విజ్, లోగో డిజైనింగ్, చిత్రలేఖనం, పోస్టర్ డిజైనింగ్ వంటి అంశాల్లో పోటీలు. ● పర్యాటకం ప్రాధాన్యంపై ఉపన్యాస పోటీలు. ● సందర్శనీయ ప్రాంతాల్లో ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పించడం. ● చారిత్రక, వారసత్వ ప్రాంతాల ప్రాముఖ్యతపై ప్రచారం చేయడం.

ప్రయోజనాలు ఇలా..

● వివిధ ప్రాంతాల్లో పర్యటించి అక్కడి వారసత్వ కట్టడాలు, పర్యాటక ప్రాంతాలపై అధ్యయనం చేయవచ్చు.

● అక్కడి ప్రజల జీవన స్థితిగతులు తెలుసుకోవచ్చు.

● యాత్రలు, అనుభూతులను కథలు, షార్ట్‌ఫిల్మ్‌గా మలిచే అవకాశం ఉంటుంది. పోటీ పరీక్షలకు ఉపయోగపడతాయి.

● పర్యాటకుల గైడ్‌గా పని చేసి ఉపాధి పొందే అవకాశం ఉంటుంది.


ఇదో సదవకాశం



యువ పర్యాటక క్లబ్‌ల ద్వారా పర్యాటక రంగంపై అవగాహన పెరుగుతుంది. ఈ రంగంలో స్థిరపడేందుకు ఇదో సదవకాశం. పర్యాటక ప్రదేశాలపై అధ్యయనం చేయడం వల్ల భవిష్యత్తులో పలు రకాలుగా ఉపయోగపడుతుంది.

– వెంకటేశ్వర్లు, నోడల్ అధికారి, మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల

పరిశోధన ఫలాలు రైతులకు అందేలా చేస్తాం: వీసీ రాజిరెడ్డి



ములుగు: ఉద్యాన పంటలు, నూతన వంగడాలపై చేసిన పరిశోధనల ఫలితంగా వచ్చిన ఫలాలను రైతులకు అందేలా చేస్తామని సిద్దిపేట జిల్లా ములుగులోని కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం ఉప కులపతి (వీసీ) దండా రాజిరెడ్డి అన్నారు. కొత్త వీసీగా సోమవారం ములుగు ఉద్యాన విశ్వవిద్యాలయంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా 11 లక్షల ఎకరాల్లో ఉద్యాన పంటలను రైతులు సాగు చేస్తున్నారన్నారు. విద్యార్థులకు పరిశోధనలతో కూడిన విద్యను అందించేందుకు మరింత కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ వీసీ నీరజ ప్రభాకర్, రిజిస్ట్రార్ భగవాన్, డీన్‌లు రాజశేఖర్, విజయ, నటరాజన్ శ్రీనివాసన్, లక్ష్మి నారాయణ, నాగేశ్వర్‌రావు, ఆచార్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక


ఎంపికైన విద్యార్థులు

సిద్దిపేట అర్బన్: ఎస్‌జీఎఫ్ ఖోఖో అండర్-14 విభాగంలో రాష్ట్ర స్థాయి పోటీలకు సిద్దిపేట గ్రామీణ మండలం రాఘవాపూర్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు హరీశ్, శివప్రసాద్, రంజిత్ ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మంజుభార్గవి తెలిపారు. ఈ నెల 20న ఉమ్మడి మెదక్ జిల్లా స్థాయి విభాగంలో ముగ్గురు విద్యార్థులు ఖోఖో పోటీల్లో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు తెలిపారు.

చికెన్ ధరలు

ఫాంరేటు	125-00	డ్రెస్డ్	213-00
రిటైల్	147-00	స్కిన్‌లెస్	243-00

రైతును బలి తీసుకున్న రక్షణ తీగ


కిషన్

వెల్దుర్తి: అడవి పందుల నుంచి పంటను రక్షించుకునేందుకు పొలం చుట్టూ ఏర్పాటుచేసిన ఇనుప కంచెకు విద్యుత్తు కనెక్షన్ ఇవ్వగా.. అదే ఆ రైతు ప్రాణాన్ని బలి తీసుకుంది. ఈ విషాదకర ఘటన మెదక్ జిల్లా వెల్దుర్తి మండలం యశ్వంతరావుపేటలో చోటుచేసుకుంది. స్థానిక ఎస్ఐ రాజు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన రాచపల్లి కిషన్ (55), స్వరూప దంపతులకు కుమారుడు వంశీ ఉన్నాడు. వ్యవసాయమే జీవనాధారం. పొలంలోకి అడవి పందులు దూరకుండా ఉండేందుకు చుట్టూ కంచె బిగించి దానికి విద్యుత్తు కనెక్షన్ ఇచ్చాడు. రోజుమాదిరిగానే ఆదివారం రాత్రి కంచెకు కరెంట్ కనెక్షన్ ఇవ్వగా, సోమవారం ఉదయం దాన్ని తొలగించేందుకు వెళ్లాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుత్తు తీగ తగిలి కరెంట్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మధ్యాహ్నమైనా ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు అక్కడికి వెళ్లి చూడగా విగతజీవిగా కనిపించాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

రెండు రోజుల్లో ఇద్దరు.. ఈ నెల 19న ఇదే గ్రామానికి చెందిన గుండెని యాదయ్య పొలం చుట్టూ ఏర్పాటుచేసిన విద్యుత్తు తీగకు తగిలి మృతి చెందిన విషయం విదితమే. అది మరువక ముందే ఈ ఘటన జరగడం గ్రామంలో విషాదాన్ని నింపింది.

విద్యుదాఘాతంతో యువరైతు...


దుర్గేశ్

హత్నూర, న్యూస్‌టుడే: అహర్నిశలు శ్రమించి పైరును కంటికి రెప్పలా కాపాడుకున్నాడు. ఆ చేనును కోసేందుకు వెళ్లి విద్యుదాఘాతానికి గురై మృత్యువాతపడ్డారు. ఈ ఘటన హత్నూర మండలం నాగుల్‌దేవుల్‌పల్లిలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్సై సుభాష్ తెలిపిన వివరాలు.. నాగుల్‌దేవుల్‌పల్లికి చెందిన పడాల దుర్గేశ్(34) సన్నకారు రైతు. వానాకాలంలో తన పొలంలో వరి వేయగా కోతకొచ్చింది. తండ్రి మల్లయ్యతో కలిసి పొలానికి వెళ్లాడు. యంత్రంతో వరి కోస్తున్న క్రమంలో.. ఆ యంత్రానికి విద్యుత్తు తీగ తగిలి దుర్గేశ్‌పై పడటంతో అతడికి తీవ్రగాయాలయ్యాయి. వెంటనే కుమారుడిని.. తండ్రి స్థానికుల సహాయంతో సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించాడు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. దుర్గేశ్‌కు భార్య లత, నాలుగేళ్ల కూతురు ఉంది. భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చెరువులోని మోటారు తీయబోయి రైతు మృతి


చంద్రం

దౌల్తాబాద్: చెరువులో ఉన్న మోటారును పైకి తీయబోయి ప్రమాదవశాత్తు నీటిలో పడి రైతు మృతి చెందిన ఘటన సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండలం ఉప్పరపల్లిలో సోమవారం చోటుచేసుకుంది. ఎస్ఐ ప్రేమ్‌దీప్ తెలిపిన వివరాలు.. ఉప్పరపల్లికి చెందిన చంద్రం(49) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. వరి పొలానికి నీరు పెట్టుకోవడానికి మోటారును చెరువులో వేశాడు. వరికి నీటి అవసరం తగ్గిపోవడంతో మోటారును పైకి తీయడానికి యత్నిస్తుండగా కాలుజారి చెరువులో పడిపోయి ప్రాణాలు కోల్పోయాడు. పొరుగు పొలం రైతులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. భార్య నిర్మల ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది.

మాచిన్‌పల్లిలో గుర్తుతెలియని మృతదేహం

దౌల్తాబాద్: సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండలం మాచిన్‌పల్లిలోని ఊట చెరువులో సోమవారం గుర్తుతెలియని మృతదేహం లభ్యమైంది. గ్రామస్థులు, పోలీసులు తెలిపిన వివరాలు.. మాచిన్‌పల్లి అటవీ ప్రాంతంలోని ఊటచెరువులో మేకలకు నీరు తాపడానికి కాపరులు వెళ్లగా మృతదేహం నీళ్లలో తేలి ఉండటాన్ని గమనించారు. వెంటనే గ్రామస్థులు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు మృతదేహాన్ని బయటకు తీసి విచారించినా ఎవరన్నది తెలియలేదన్నారు.

పాత కక్షలతో యువకుడి హత్య


అనిల్‌రాజు

సదాశివపేట, న్యూస్‌టుడే: పాత కక్షలతో యువకుడిని దారుణంగా హత్య చేసిన ఘటన సదాశివపేట పట్టణంలో చోటుచేసుకొంది. సీఐ తెలిపిన వివరాలు.. మ్యాతరి అనిల్ రాజు(29) సిద్దాపూర్ ఎస్సీ కాలనీలో నివాసం ఉంటున్నాడు. మరుగుదొడ్లు, సెప్టిక్ ట్యాంకులు శుభ్రం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం రాత్రి కాలనీకి చెందిన మరో ఇద్దరితో కలసి మద్యం తాగడానికి వెళ్లి తిరిగిరాలేదు. సోమవారం ఉదయం స్థానిక ప్రభుత్వ నర్సరీలో యువకుడి మృతదేహం రక్తపు మడుగులో ఉందని సమాచారం అందడంతో పోలీసులు ఘటనాస్థలికి వెళ్లి పరిశీలించారు. గుర్తుతెలియని వ్యక్తులు కత్తులతో పొడిచి దారుణంగా హత్య చేశారు. అనిల్ రాజు తల్లి ధనలక్ష్మి కాలనీలోని ముగ్గురిపై అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఆ ముగ్గురితో తమ కుటుంబానికి విభేదాలు ఉన్నాయని, పాత కక్షలతో హత్య చేసి ఉంటారని పేర్కొన్నారు. పోలీసులు క్లూస్‌టీంను రప్పించి ఆధారాలు సేకరించారు. హత్యచేసిన వారిని త్వరలోనే పట్టుకుంటామని సీఐ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య


లింగంచారి

పాపన్నపేట: ఆర్థిక ఇబ్బందులతో ఒకరు ఆత్మహత్య చేసుకున్నాడు. మెదక్ జిల్లా పాపన్నపేట ఎస్ఐ శ్రీనివాస్‌గౌడ్ తెలిపిన వివరాలు.. మండలంలోని పాత లింగాయిపల్లికి చెందిన కమ్మరి లింగంచారి (36), అనిత దంపతులకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. లింగంచారి 8 ఏళ్లుగా కుటుంబంతో సహా హైదరాబాద్‌లో ఉంటూ మేస్త్రీగా పని చేస్తున్నాడు. దసరాకు అందరూ స్వగ్రామానికి వచ్చారు. కొన్ని నెలలుగా ఉపాధి సరిగా లేక ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాడు. ఈ విషయమై భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో గదిలో దూలానికి ఉరేసుకున్నాడు. స్థానికులు గమనించి కుటుంబీకులకు సమాచారం ఇచ్చారు. మృతుడి సోదరుడు సుధాకర్ ఫిర్యాదుతో కేసు నమోదైంది.

మనోవేదనతో మరొకరు..


రమేష్

నిజాంపేట (రామాయంపేట): ఆర్థికంగా సతమతమవుతున్న ఒకరు మనోవేదనతో ఆత్మహత్య చేసుకున్నాడు. మెదక్ జిల్లా నిజాంపేట ఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి తెలిపిన వివరాలు.. మండలంలోని నార్లాపూర్‌కు చెందిన బోయిని రమేష్ (32), భాగ్యలక్ష్మి దంపతులకు ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వచ్చే కూలి డబ్బులతో కుటుంబ పోషణ భారంగా మారడంతో మనస్తాపం చెందాడు. ఆదివారం అర్ధరాత్రి ఇంట్లో నుంచి బయటకు వెళ్లి సమీపంలోని కల్వకుంట శివారులో చెట్టుకు ఉరేసుకున్నాడు. సోమవారం ఉదయం గమనించారు. భాగ్యలక్ష్మి ఫిర్యాదుతో కేసు నమోదైంది.

ట్రాక్టర్ ఢీకొని రైతు దుర్మరణం


బాలకిష్టయ్య

దుబ్బాక: అతి వేగంతో, అజాగ్రత్తగా ట్రాక్టర్ డ్రైవర్.. వెనుక నుంచి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో రైతు తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందాడు. సిద్దిపేట జిల్లా దుబ్బాక ఎస్ఐ గంగరాజు తెలిపిన వివరాలు.. దుబ్బాక మండలం బల్వంతాపూర్‌కు చెందిన జంగిటి బాలకిష్టయ్య (65), లక్ష్మి దంపతులకు నలుగురు సంతానం. వ్యవసాయమే జీవనాధారం. ఆదివారం మధ్యాహ్నం బాలకిష్టయ్య ఇంటి నుంచి ద్విచక్రవాహనంపై బల్వంతాపూర్ గ్రామానికి ఓ పని నిమిత్తం బయల్దేరాడు. మార్గమధ్యలో ట్రాక్టర్ డ్రైవర్ అతివేగంగా వచ్చి బాలకిష్టయ్య బైక్‌ను ఢీకొట్టాడు. తీవ్రంగా గాయపడిన అతడికి సిద్దిపేట జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. సోమవారం కేసు నమోదు చేశారు.

బైక్ అదుపు తప్పి వాహనదారుడు..

బెజ్జంకి: రాజీవ్ రహదారిపై ద్విచక్రవాహనం అదుపు తప్పి రెయిలింగ్‌ను ఢీ కొట్టడంతో యువకుడు మృతి చెందగా, మరొకరికి గాయాలయ్యాయి. ఈ ఘటన సోమవారం సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలం తోటపల్లి శివారులో చోటుచేసుకుంది. ఎస్సై కృష్ణారెడ్డి తెలిపిన వివరాలు.. గోదావరిఖనికి చెందిన బోనగిరి మనోజ్(25), కొత్తగూడెంకు చెందిన జోన్ అన్విత్ ఇద్దరు మిత్రులు. కరీంనగర్‌లో అద్దె గదిలో ఉంటూ ప్రైవేటు కంపెనీల్లో పని చేస్తున్నారు. పని నిమిత్తం కరీంనగర్ నుంచి ద్విచక్ర వాహనంపై సిద్దిపేట వైపు బయల్దేరారు. తోటపల్లి వద్ద ప్రమాదం జరిగింది. 108 వాహనంలో ఇద్దరిని కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా మనోజ్ మృతి చెందాడు. అన్విత్ చికిత్స పొందుతున్నాడు. ఫిర్యాదు రాగానే కేసు నమోదుచేస్తామని ఎస్సై తెలిపారు.

రక్తహీనతతో ఇబ్బందులు

సంగారెడ్డి టౌన్, న్యూస్‌టుడే: విద్యార్థినులు రక్తహీనత సమస్యను అధిగమించాలని స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ అరుణాబాయి పేర్కొన్నారు. సోమవారం కళాశాలలో విద్యార్థినులకు హిమోగ్లోబిన్, బ్లడ్ గ్రూప్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా రక్తహీనత సమస్యను అధిగమించవచ్చన్నారు. రక్తదాన్ సేవా ట్రస్ట్ సిబ్బంది, వైద్య సిబ్బంది, అధ్యాపకులు పాల్గొన్నారు.

క్యాన్సర్ బాధితులకు అండగా నిలవాలి

జోగిపేట, న్యూస్‌టుడే: క్యాన్సర్ బాధితులకు లయన్స్ క్లబ్ తరపున అండగా నిలవాలని లయన్ జిల్లా మాజీ గవర్నర్ డాక్టర్ రవీందర్‌గౌడ్ కోరారు. క్యాన్సర్ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి జోగిపేట పట్టణంలోని క్లబ్ భవనం ఆవరణలో సమావేశం జరిగింది. జోగిపేటలో క్లబ్ ఏర్పాటు చేసి 50 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా సీనియర్ సభ్యులచే ఒక ట్రస్టును ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అనంతరం క్లబ్ పక్షాన జోగిపేట ఏఎంసీ అధ్యక్షుడిగా త్వరలో ప్రమాణస్వీకారం చేయబోతున్న క్లబ్ సభ్యుడైన జగన్మోహన్‌రెడ్డిని సన్మానించారు. కార్యక్రమానికి అల్లె శ్రీకాంత్ అధ్యక్షత వహించారు. డాక్టర్ అనంత్ రెడ్డి, రాంబాబు, రామకృష్ణ, సంతోష్‌కుమార్, కృష్ణారెడ్డి, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

హత్నూర ఐటీఐలో అప్రెంటీస్ మేళా

హత్నూర: హత్నూరలోని ఐటీఐలో సోమవారం అప్రెంటిస్ మేళా నిర్వహించారు. మొత్తం 60 మంది విద్యార్థులు హాజరుకాగా 37 మందిని ఎంపిక చేశారు. ఏడాది శిక్షణ అనంతరం ప్రతిభ ఆధారంగా పూర్తిస్థాయి ఉద్యోగ భద్రత కల్పిస్తామని పరిశ్రమల ప్రతినిధులు పేర్కొన్నారు.

ఆర్టీసీ కార్మికులకు బహుమతులు

నారాయణఖేడ్, న్యూస్‌టుడే: దసరా పండుగ సందర్భంగా ఖేడ్ ఆర్టీసీ డిపోనకు 10 రోజుల్లో రూ.1.30 కోట్ల కలెక్షన్లు వచ్చేలా కృషి చేసిన డిపో కార్మికులు, ఉద్యోగులకు సోమవారం స్థానిక డిపోలో కార్యక్రమం అందజేశారు. డీఎం మల్లేశయ్య పలువురికి బహుమతులు అందజేశారు. ప్రయాణికులకు మెరుగైన సేవలు అందిస్తూ అధిక ఆదాయం వచ్చేలా నిరంతరం కృషి చేయాలని కోరారు.

జ్యోతినగర్‌లో గౌరమ్మ పూజలు

ఐడిఏబొల్లారం (జిన్నారం), న్యూస్‌టుడే: ఐడిఏ బొల్లారం పట్టణంలోని జ్యోతి నగర్‌లో సోమవారం గౌరమ్మ పూజలు నిర్వహించారు. శ్రీకాకుళం ప్రాంతంలో అమ్మవారిని ప్రత్యేకంగా పూజిస్తారని, ఇక్కడ కూడా ఆ ప్రాంతం వారు ఎక్కువగా ఉండటంతో గౌరమ్మ వేడుకలు నిర్వహిస్తున్నారని స్థానిక నాయకులు తెలిపారు.

పట్టభద్రులంతా ఓటరుగా నమోదు కండి

సంగారెడ్డి టౌన్, న్యూస్‌టుడే: ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో పట్టభద్రులంతా ఓటరుగా నమోదు కావాలని టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు జావిద్ పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక జిల్లా కార్యాలయంలో టీఎన్జీవో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఓటరు నమోదు కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. అర్హులందరూ ఓటరుగా నమోదు కావడంతో పాటు సమర్థులను ఎన్నుకోవాలని సూచించారు.

ఎల్ఐసీ ఏజెంట్ల నిరసన

జహీరాబాద్, న్యూస్‌టుడే: తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ జహీరాబాద్ పట్టణంలోని ఎల్ఐసీ కార్యాలయం ప్రధాన ద్వారం వద్ద ఏజెంట్లు మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏజెంట్ల సంఘం జహీరాబాద్ శాఖ అధ్యక్షుడు విఠల్‌గౌడ్ మాట్లాడుతూ.. సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన ఉద్ధృతం చేస్తామన్నారు. గౌరవ అధ్యక్షుడు తేజీరెడ్డి, వెంకటేశం, కిష్టన్న, ఆర్.సుభాష్, ప్రభుశంకర్ పాల్గొన్నారు

నాందేడ్‌లో కాంగ్రెస్ నేతలతో ఎంపీ సమీక్ష

నారాయణఖేడ్: మహారాష్ట్రలోని నాందేడ్‌లో సోమవారం నాందేడ్ పార్లమెంటు స్థానం పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాల కాంగ్రెస్ నాయకులతో ఎంపీ సురేశ్ షెట్కార్ సమీక్ష నిర్వహించారు. నాందేడ్ పార్లమెంటు స్థానానికి కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జిగా ఆయన వ్యవహరిస్తున్నారు.

ఆదాయం సరే.. సౌకర్యాలు లేవే..

పోతిరెడ్డిపల్లి కూడలిలో ప్రయాణికుల అవస్థలు

సంగారెడ్డి అర్బన్, న్యూస్‌టుడే: సంగారెడ్డి పట్టణం పోతిరెడ్డిపల్లి ఆర్టీసీ బస్ పాయింట్ వద్ద నిలువ నీడలేదు. తాగేందుకు నీటి సౌకర్యం కానరాదు. అత్యవసరంలో అయితే ఉగ్గబట్టుకోవాల్సిందే. ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ ప్రయాణికులు నిరీక్షించాల్సిందే. ఆదాయం సమకూరుతున్న వసతులు కల్పించడంలో అధికారులు విఫలమవుతున్నారని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు.



నిలువనీడ లేక పోతిరెడ్డిపల్లి కూడలి వద్ద ప్రయాణికుల పాట్లు

రోడ్డు తవ్వారు.. వదిలేశారు..

పోతిరెడ్డిపల్లి కూడలి నుంచి హైదరాబాద్‌లోని మదీనగూడ చౌరస్తా వరకు ఎక్స్‌ప్రెస్ హైవే విస్తరణ పనులు చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ దారి బాగు కోసం రూ.800 కోట్ల నిధులు మంజూరు చేసింది. సంబంధిత గుత్తేదారు రెండు నెలల క్రితం దారి వెంట భారీగా గోతులు తవ్వారు. మధ్యలోనే వాటిని నిలిపి వేశారు. గత నెలరోజులకు పైగా కావొస్తున్నా ఆయా పనులు ముందుకు సాగడం లేదు. ఇప్పటికే అక్కడ ఇబ్బందులు పడుతుంటే మరో వైపు గోతుల కారణంగా అవస్థలు తప్పడం లేదు.



విస్తరణ కోసం తవ్వి వదిలేసిన గుంత

విస్తరణ వరకు ఆగాల్సిందేనా?

ఎక్స్‌ప్రెస్ హైవే విస్తరణ కారణంగా అక్కడ ఎలాంటి పనులు చేపట్టలేమని సంబంధిత శాఖ వర్గాలు వెల్లడించడం గమనార్హం. పనులు ఎప్పుడు పూర్తవుతాయి? అప్పటి వరకు ఇబ్బందులు పడాల్సిందేనా.. అంటూ ప్రయాణికులు వాపోతున్నారు. కనీసం తాత్కాలికంగా బస్ షెల్టర్లు, శౌచాలయాలు, తాగునీటి సౌకర్యం కల్పిస్తే కొంత వరకు ఊరట కలుగుతుందంటున్నారు.

అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నాం

-ఉపేందర్, డిపో మేనేజర్, సంగారెడ్డి.

ప్రయాణికుల ఇబ్బందులపై సంగారెడ్డిలో జరిగిన ప్రతి జిల్లా స్థాయి సమావేశంలో బస్‌షెల్టర్లు, శౌచాలయాలు, తాగునీటి తదితర సమస్యలను పరిష్కరించాలని విన్నవిస్తున్నాం. ఇప్పటికే పలుమార్లు కలెక్టర్, అదనపు కలెక్టర్, మంత్రులు, ఎంపీలను, ఎమ్మెల్యేలను కలిసి ఫిర్యాదులు చేశాం.

భూసేకరణ వల్ల పనులు నిలిచాయి

-రామకృష్ణ, డిప్యూటీఈఈ, నేషనల్ హైవే అథారిటీ, సంగారెడ్డి

భూ సేకరణ ఎక్స్‌ప్రెస్ హైవే విస్తరణ వల్ల పోతిరెడ్డిపల్లి చోట పనులు నిలిచిపోయాయి. త్వరలో రైతులతో మాట్లాడి సమస్య పరిష్కరించేలా చూస్తాం. నీళ్లు నిలిచిన చోట్ల తొలగించేలా చూస్తాం. విస్తరణ పూర్తయ్యాక నిబంధనల ప్రకారం పోతిరెడ్డిపల్లి కూడలి దాటిన తర్వాత కొద్ది దూరంలో శాశ్వతంగా ఉండేలా చిన్నపాటి బస్టాండు కట్టిస్తాం. ప్రయాణికులకు సౌకర్యాలు కల్పిస్తాం. ఇందుకు కనీసం రెండేళ్ల సమయం పడుతుంది.

మేమున్నాం.. మీకు తోడుగా..

ఫోన్ చేయాల్సిన నంబర్లు (10AM TO 1 PM)
సంగారెడ్డి 8008573233, జహీరాబాద్ 9441648363
నారాయణఖేడ్ 8008573248, నారాయణఖేడ్ టౌన్ 8008573250
అందోలు 8008573241, జిన్నారం 8008573231

? జోగిపేట పట్టణంలోని ప్రభుత్వ వసతి గృహం పక్కనే ఉన్న ఖాళీ స్థలంలో పొదలు పెరిగాయి. పందులు, పాముల సంచారం పెరిగింది. పక్కన వసతి గృహాలు, ఇళ్లు ఉండటంతో కాలనీ వాసులు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. **-సునీల్‌కుమార్, జోగిపేట.**

✓ ఖాళీ స్థలంలో పెరిగిన పొదలు తొలగించేలా చర్యలు తీసుకుంటాం. ఇబ్బందులు తొలగిస్తాం.
-వినయ్‌కుమార్, పారిశుద్ధ్య పర్యవేక్షకులు, అందోలు- జోగిపేట.

? అందోలు మండలం చింతకుంటలో కొన్నేళ్లుగా భవనం అసంపూర్తిగా ఉంది. దీనిని పూర్తి చేస్తే గ్రామానికి ఉపయోగపడే అవకాశం ఉంది.
-కిష్టయ్య, చింతకుంట.

✓ అసంపూర్తిగా నిలిచిపోవడానికి గల కారణాలు తెలుసుకొని పూర్తి చేయడానికి ప్రయత్నిస్తా. **-కృష్ణ, ఏఈ పీఆర్ అందోలు.**

ఉపకార వేతనాలు విద్యార్థుల హక్కు

జహీరాబాద్ అర్బన్: ప్రభుత్వం అందిస్తున్న ఉపకార వేతనాలు భిక్ష కాదని, విద్యార్థుల హక్కు అని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రసాద్ సాగర్ అన్నారు. జహీరాబాద్ పట్టణంలో సోమవారం విద్యార్థి సంఘం సమావేశం నిర్వహించి మాట్లాడారు. సకాలంలో ఉపకార వేతనాలు, బోధనా రుసుములు అందక పేద, మధ్యతరగతి విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. తరగతులు కోల్పోయి రోడ్డెక్కి ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వం బకాయిల విడుదలపై స్పందించకపోవడం బాధాకరమన్నారు. ఉపకార వేతనాలు అందించని పక్షంలో ఆందోళనలు చేపడతామన్నారు. సమావేశంలో కార్తీక్ సాగర్, విశాల్, మల్లేష్, వినోద్, మిథున్ రాథోడ్ పాల్గొన్నారు.

మంజీర నీరు సాగులోకి వచ్చేలా చర్యలు: ఎమ్మెల్యే

మనూరు, న్యూస్‌టుడే: మంజీర నీరు కాల్వ ద్వారా సాగులోకి తీసుకొచ్చేలా చర్యలు తీసుకుంటున్నామని నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. సోమవారం మనూరు మండలం పుల్‌కుర్తి వద్ద విశ్రాంత నీటిపారుదల శాఖ అధికారి విఠల్‌రావు పాటిల్‌తో కలిసి మంజీర నదిని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. నియోజకవర్గంలోని రైతుల పొలాలకు నీరు అందించేలా కొత్త ప్రాజెక్టు డిజైన్ రూపొందించనున్నామని పేర్కొన్నారు. ఆయన వెంట బోజిరెడ్డి, దిలీప్‌రెడ్డి ఉన్నారు.



పుల్‌కుర్తి వద్ద మంజీర నదిని పరిశీలిస్తున్న సంజీవరెడ్డి

మహీంద్రా కార్మికులకు బోనస్

జహీరాబాద్ అర్బన్, న్యూస్‌టుడే: జహీరాబాద్ మహీంద్రా అండ్ మహీంద్రా కార్మికులకు చారిత్రాత్మక బోనస్ సాధించినట్లు గుర్తింపు కార్మిక సంఘం (సీఐటీయూ) ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి, పారిశ్రామిక క్లస్టర్ కన్వీనర్ మహిపాల్ తెలిపారు. పట్టణ శివారులోని కర్మాగారంలో సోమవారం యూనియన్ సమావేశం నిర్వహించి మాట్లాడారు. యాజమాన్యాన్ని ఒప్పించి ఈ యేడు రూ.78 వేల నుంచి రూ.1.15 లక్షల పైచిలుకు బోనస్ సాధించుకున్నట్లు చెప్పారు. ఎక్కువ మంది కార్మికులకు కనీసం రూ.లక్ష వరకు బోనస్ అందించిన ఘనత అధికార గుర్తింపు సంఘానికి దక్కుతుందన్నారు. సమావేశంలో నాయకులు సూరి, నరేష్, రాజు, మసి, విజయ్, సాజిద్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న యూనియన్ కార్యదర్శి రాజిరెడ్డి

కాంగ్రెస్‌లో చేరికలు

కంది, న్యూస్‌టడే: రాష్ట్ర అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని టీజీఐఐసీ ఛైర్‌పర్సన్ నిర్మలారెడ్డి పేర్కొన్నారు. కంది మండలం బేగంపేట్ గ్రామానికి చెందిన మహేష్‌గౌడ్ ఆధ్వర్యంలో భారాసకు చెందిన పలువురు హైదరాబాద్‌లో నిర్మలారెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రఘురాంగౌడ్, నాయకులు రామ్ సింగ్ నాయక్ పాల్గొన్నారు.

పంట మార్పిడితో దిగుబడులు

సంగారెడ్డి అర్బన్, న్యూస్‌టుడే: పంట మార్పిడి ద్వారా అధిక దిగుబడులు వస్తాయని విశ్రాంత వ్యవసాయాధికారి ఎన్.సురేశ్‌బాబు పేర్కొన్నారు. సోమవారం సంగారెడ్డి మండలం ఫసల్‌వాదిలో రాజేంద్రనగర్ వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ఎన్ఎస్ఎస్ శిబిరం నిర్వహించారు. డీసీసీబీ ఉపాధ్యక్షుడు పట్నం మాణిక్యం చీడపీడల నివారణపై సూచనలిచ్చారు. అంతకు ముందు గ్రామంలో గాలికుంటు టీకాల శిబిరం చేపట్టారు. ఏరువాక కేంద్రం సమన్వయకర్త రాహుల్, నిర్మల, అనిశ్‌కుమార్ వర్మ, శ్రీలత, అరుణ పాల్గొన్నారు.

ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవం

రాయికోడ్, న్యూస్‌టుడే: మాధవానంద సరస్వతి సమక్షంలో ప్రతిష్ఠాపనోత్సవాలు సోమవారం ఘనంగా ముగిశాయి. రాయికోడ్‌లోని హనుమాన్ దేవాలయ పునఃప్రారంభ ఉత్సవాల్లో భాగంగా సోమవారం ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్ ఉత్సవాల్లో పాలొన్నారు. గంగాధర శివచార్య స్వామి, చెన్న మల్లికార్జున స్వామి భక్తులనుద్దేశించి ప్రవచించారు.



పూజలు చేస్తున్న మాధవానంద సరస్వతి స్వామి

శబరిమలకు పాదయాత్ర



అయ్యప్ప దేవాలయం ఎదుట దీక్షాపరులు

సదాశివపేట, న్యూస్‌టుడే: సదాశివపేట పట్టణం నుంచి శబరిమలకు పాదయాత్రగా వెళ్లేందుకు గురుస్వాములు నాయుడు, శ్రీను ఆధ్వర్యంలో సోమవారం సదాశివపేటలోని అయ్యప్ప స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పాదయాత్ర ప్రారంభించారు. వారు మాట్లాడుతూ.. 41 రోజుల్లో శబరిమలకు చేరుకుంటామన్నారు.

ఆలయాలపై దాడులు అరికట్టాలని నిరసన

జిన్నారం, న్యూస్‌టుడే: ఆలయాలపై దాడులను అరికట్టాలని డిమాండు చేస్తూ హిందూ సంఘాల నాయకులు సోమవారం జిన్నారంలో ర్యాలీ నిర్వహించారు. ఈమేరకు సీఐ సుధీర్‌కుమార్‌కు వినతి పత్రం అందించారు. సికింద్రాబాద్‌లో ముత్యాలమ్మ ఆలయ ధ్వంసం ఘటనపై విచారణ చేసి నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండు చేశారు.



జిన్నారంలో ర్యాలీ

తడి, పొడి చెత్త సేకరణపై అవగాహన

నారాయణఖేడ్: పురపాలిక కార్యాలయంలో కమిషనరు జగ్జీవన్ పురపాలిక సోమవారం పారిశుద్ధ్య కార్మికులు, చెత్త సేకరణ ఆటోల డ్రైవర్లకు తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించే విషయంపై అవగాహన కల్పించారు. పారిశుద్ధ్యవిభాగం పర్యవేక్షకులు శ్రీనివాస్ పాల్గొన్నారు.

టీఎస్‌యూటీఎఫ్ కార్యవర్గం

కొండాపూర్: మండల టీఎస్‌యూటీఎఫ్ మండల కార్యవర్గాన్ని సోమవారం కొండాపూర్‌లో ఎన్నుకున్నట్లు ఆ సంఘం జిల్లా కార్యదర్శి బి.సాయి తేజ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల అధ్యక్షుడిగా బాలకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా వెంకయ్య, సహ అధ్యక్షురాలుగా జ్యోతి, శశికాంత్, కోశాధికారిగా విజయ్ కుమార్, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా సాయన్న, కార్యదర్శులుగా సంజీవయ్య, బాలయ్య, పూలమ్మ, రంజిత్, ఉమాదేవి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని పేర్కొన్నారు.



బాలకృష్ణ, అధ్యక్షుడు

చేగుంటలో కారు దగ్ధం

చేగుంట, న్యూస్‌టుడే: కారులో మంటలు వచ్చి దగ్ధమైన ఘటన చేగుంటలో సోమవారం మధ్యాహ్నం జరిగింది. ఆందోల్‌కు చెందిన రాఘవేంద్రశర్మతో పాటు మరో ముగ్గురు కారులో వచ్చి చేగుంట పీఏసీఎస్ వద్ద నిలిపారు. నలుగురు దిగిన తర్వాత కొద్దిసేపటికి అందులో నుంచి పొగలు వచ్చి మంటలు వ్యాపించాయి. వెంటనే రాఘవేంద్రశర్మ మంటలను ఆపే ప్రయత్నం చేయగా అప్పటికే పూర్తిగా కాలిపోయింది. రామాయంపేట నుంచి అగ్నిమాపక యంత్రం వచ్చి ఆర్పేసినా ప్రయోజనం లేకపోయింది. కారులో విద్యుదాఘాతం జరిగి ప్రమాదం చోటు చేసుకోవచ్చని భావిస్తున్నారు.

కట్టమైసమ్మ ఆలయంలో చోరీ

కోహీర్, న్యూస్‌టుడే: మండల పరిధి పీచేర్యాగడి తండాలోని కట్ట మైసమ్మ ఆలయంలో చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు.. కట్ట మైసమ్మ ఆలయం గ్రామానికి దూరంగా ఉండటం, రాత్రి సమయంలో ఎవరూ లేకపోవడంతో ఆదివారం రాత్రి దుండగులు తాళాలు పగులగొట్టి లోనికి ప్రవేశించారు. గుడిలోని 21 తులాల ఆభరణాలు, మూడున్నర కిలోల వెండితో పాటు హుండీల్లోని నగదు ఎత్తుకెళ్లారని ఆలయ పూజారి రమావత్ రమేశ్‌రాథోడ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆలయ పరిసరాల్లో సీసీ కెమెరాలు లేవు. సీఐ శివలింగం, ఎస్ఐ గోపతి సతీష్, క్లూస్ టీం సభ్యులు ఘటనా స్థలాన్ని సోమవారం పరిశీలించారు. అర్చకులు రమేష్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మత్స్యకారుల సంక్షేమానికి కృషి

సంగారెడ్డి టౌన్, న్యూస్‌టుడే: జిల్లా మత్స్యశాఖ అధికారి నరసింహారావు సోమవారం స్థానిక ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మత్స్యకారుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. నియోజకవర్గంలోని చెరువులు, కుంటల్లో చేప పిల్లల విత్తనం పంపిణీపై చర్చించారు.



సూచనలు చేస్తున్న చింతా ప్రభాకర్

బాధితుడికి ఎల్‌వోసీ అందజేత

జహీరాబాద్: రంజోల్‌కు చెందిన చాకలి బక్కప్ప కుటుంబీకులకు స్థానిక ఎమ్మెల్యే కె.మాణిక్‌రావు సోమవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో ఎల్‌వోసీ పత్రాన్ని అందజేశారు. అనారోగ్యానికి గురైన ఆయన కుటుంబం పడుతున్న ఇబ్బందులను స్థానికుల ద్వారా తెలుసుకున్న ఎమ్మెల్యే ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రూ.1.25 లక్షల ముందస్తు అనుమతి పత్రాన్ని ఇప్పించారు.

సతీష్‌యాదవ్ నియామకం



హత్నూర: అఖిల భారత యాదవ మహాసభ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడిగా దౌలాపూర్‌కు చెందిన ఎర్ర సతీష్ యాదవ్ నియమితులయ్యారు. సోమవారం రాష్ట్ర అధ్యక్షుడు యశ్వంత్‌రాజు యాదవ్ హైదరాబాద్‌లో నియామక పత్రం అందించారు.

అండర్-18 ఖోఖో జట్టుకు ఎంపిక

కల్హేర్, న్యూస్‌టుడే: ఉమ్మడి మెదక్ జిల్లా అండర్-18 జూనియర్ బాలికల విభాగంలో ఖోఖో క్రీడా పోటీల్లో క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించిన క్రిష్ణాపూర్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు హెచ్ఎం కమ్మరి సుధాకర్ తెలిపారు. క్రీడా పోటీలను టీజీడబ్ల్యూఆర్ఎస్ నర్సాపూర్ గురుకుల పాఠశాలలో ఆదివారం నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఎంపికైన సంయుక్త, పూజ, వసంత, హర్షిత ఈ నెల 28 నుంచి 30 వరకు మహబూబ్‌నగర్ జూనియర్ కళాశాలలో నిర్వహించే పోటీల్లో పాల్గొంటారన్నారు. ఉమ్మడి మెదక్ జిల్లా అండర్-14 పాఠశాల క్రీడా సమాఖ్య ఖోఖో పోటీలు బాలికల విభాగంలో సంగారెడ్డిలో ఆదివారం నిర్వహించగా పాఠశాలకు చెందిన ఆర్.సోనా 63వ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. వీరిని, పీఈటీ రాములు హెచ్ఎం సుధాకర్ అభినందించారు.



క్రిష్ణాపూర్ ఉన్నత పాఠశాల బాలికలు

క్రికెట్‌లో స్రగ్వీ..



జోగిపేట, న్యూస్‌టుడే: అండర్-17 జిల్లా స్థాయి బాలికల క్రికెట్ పోటీలకు జోగిపేటకు చెందిన స్రగ్వీ ఎంపికయ్యారు. ఈ నెల 19న సంగారెడ్డి పట్టణంలో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో జరిగిన ఉమ్మడి మెదక్ జిల్లా క్రికెట్ జట్టు ఎంపికల పోటీల్లో ప్రతిభ కనబర్చి ఎంపికైనట్లు పాఠశాల యాజమాన్యం తెలిపింది.

బాస్కెట్‌బాల్‌లో..: జిన్నారం: ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు అండర్-19 విభాగంలో జిన్నారం గిరిజన గురుకులానికి చెందిన ఇంటర్ ప్రథమ విద్యార్థులు జీవన్, కిరణ్‌కుమార్, పదో తరగతి విద్యార్థి సతీష్ ఎంపికైనట్లు ప్రిన్సిపల్ వెంకట్‌నారాయణ, వైస్ ప్రిన్సిపల్ వెంకటయ్య, కోచ్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సిద్దిపేటలో ఎంపిక జరిగిందన్నారు.

మలుపులు.. ప్రమాదాలకు నిలయాలు

రోడ్లను ఆనుకున్న పొదలతో ఇబ్బందులు

న్యూస్‌టుడే, నారాయణఖేడ్, కంగ్టి, కల్హేర్, సిర్గాపూర్, మనూరు: ఖేడ్ నియోజకవర్గంలోని జాతీయ రహదారులు, ర.భ, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖల పరిధిలో మలుపులకు తోడు రోడ్లను ఆనుకుని చెట్లు, పొదలు దట్టంగా పెరగడంతో ప్రమాదాలకు ఆస్కారం ఏర్పడుతోంది. పలు చోట్ల రోడ్లను విస్తరించినా కల్వర్టులు, వంతెనల నిర్మాణం చేపట్టకపోవడంతో చోదకులు ఏమాత్రం అజాగ్రత్తగా వాహనాలు నడిపినా ప్రమాదాలు తప్పవు.



ఖేడ్ మండలం వెంకటాపూర్ వద్ద ప్రమాదకరంగా మలుపు

నియోజకవర్గం మీదుగా సంగారెడ్డి-నాందేడ్-అకోలా 161 జాతీయ రహదారిని నాలుగు వరుసలుగా ఈ మధ్యే విస్తరించారు. నిజాంపేట-ఖేడ్-బీదర్ 161బీ ఎన్‌హెచ్‌తో పాటు ర.భ. శాఖ పరిధిలోని ఖేడ్-సిర్గాపూర్ రోడ్డు విస్తరణ పనులు కొనసాగుతున్నాయి. పలు గ్రామాలు, తండాలకు రోడ్ల నిర్మాణం కోసం ఈ మధ్యే రూ.60 కోట్ల వరకు మంజూరయ్యాయి. ఆయా రోడ్ల పనులతో పాటు కొత్త దారుల నిర్మాణ సమయంలో మలుపులను తగ్గిస్తూ రోడ్లను ఆనుకుని పొదలు లేకుండా అధికారులు దృష్టి పెడితే బాగుంటుందని చోదకులు చెబుతున్నారు.



హుస్రానా(జి) వద్ద పొదల కారణంగా జరిగిన ప్రమాదం

అతి ప్రమాదకరం

నిజాంపేట నుంచి ఖేడ్ మీదుగా కర్ణాటకలోని బీదర్ వరకు ఉన్న 161బీ ఎన్‌హెచ్‌లో ఖేడ్-నిజాంపేటల మధ్య దూరం 15 కిలోమీటర్లు. ఈ రోడ్డు రెండు వరుసలుగా ఉంది. ఈ దారిలో 25 మలుపులు ఉండగా వాటిలో 16 అతిప్రమాదకరంగా ఉన్నాయి. దారికి ఇరుపక్కలా అధిక శాతం అటవీ భూములు ఉండటంతో రహదారులకు ఆనుకునే చెట్లు, పొదలు దట్టంగా పెరిగాయి. దీంతో అతి సమీపానికి వస్తే గాని ఎదురుగా వచ్చే వాహనం కనపడని పరిస్థితి. దీంతో తరచూ ఎక్కడోచోట ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. 15 ఏళ్ల కిందట డబుల్ లైన్‌గా విస్తరించినా ఆరు కల్వర్టుల పనులు చేపట్టకపోవడంతో ఇరుకుగా ఉండి ప్రమాదాలు పెరగడానికి కారణమవుతున్నాయి.

ఎత్తుపల్లాలతో అవస్థ లు

ఖేడ్-కంగ్టి మధ్య దూరం 30 కి.మీలు. 12 మలుపులు ఉండగా అందులో ఆరు ప్రమాదకరంగా ఉన్నాయి. దీనికి తోడు 16 కి.మీల మేర గట్లపై నుంచి రహదారి ఉండటంతో ఎత్తుపల్లాలుగా మారి ప్రమాదాలకు తీవ్రతకు అవకాశం కల్పిస్తోంది. మూడుచోట్ల తక్కువ స్థాయి కల్వర్టులు సైతం ప్రమాదకరంగా మారాయి.

- మనూరు మండలంలోని మనూరు- బీదర్ మార్గంలో మనూరు, బెల్లాపూర్, పుల్‌కుర్తి వంతెనల వద్ద, శెల్గిరా, దోపూరు అడ్డరోడ్ల వద్ద మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి.
- కల్హేర్ మండలంలోని 161 జాతీయరహదారిలో దేవునిపల్లి సమీపంతోపాటు నాగధర్-మునిగేపల్లి, నాగధర్-కృష్ణాపూర్‌ల మధ్య ఇదే పరిస్థితి నెలకొంది.
- సిర్గాపూర్ మండలంలోని సిర్గాపూర్, బొక్కస్ గామ, నల్లవాగు సమీపాల్లో వాహనచోదకులు అప్రమత్తంగా ఉండాల్సిందే.
- నాగల్‌గిద్దా మండలంలోని ఇరక్‌పల్లి, ఔదత్‌పూర్, గూడూరుల వద్ద ఉన్న మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి.

23న జహీరాబాద్ బంద్‌కు పిలుపు

జహీరాబాద్, న్యూస్‌టుడే: ఆలయాల్లో విగ్రహాలు ధ్వంసం చేయడాన్ని నిరసిస్తూ ఈ నెల 23న జహీరాబాద్‌లో బంద్ నిర్వహించాలని హిందూ సంఘాలు పిలుపునిచ్చాయి. ఈ మేరకు స్థానికంగా ఓ వేడుక మందిరంలో సోమవారం నిర్వహించిన వివిధ ఆధ్యాత్మిక సంఘాలు, కుల సంఘాలు, హిందు సంఘాల సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు.

నీటి సరఫరాలో అంతరాయం ఉండొద్దు

ఝరాసంగం, న్యూస్‌టుడే: నీటి సరఫరాలో అంతరాయం ఉండొద్దని మిషన్ భగీరథ డిప్యూటీ కుమారస్వామి సూచించారు. సోమవారం ఝరాసంగం ఎంపీడీవో కార్యాలయంలో గ్రామాలకు తాగునీరు వదులుతున్న సిబ్బందితో సమావేశమయ్యారు. పైపులైన్ లీకేజీలు ఎప్పటికప్పుడు మరమ్మతులు చేయాలన్నారు. సురక్షిత తాగునీరు అందేలా చొరవ తీసుకోవాలన్నారు.